


పారిజాతపు పూలు తలంబ్రాల్లాగ రాలుతున్నాయి. మల్లెపూల పందిర లాగ ఆకాశం అంతా వెన్నెలతో విరగ బూసింది కౌగిట్లోంచి బయట పడలేక చివరిసారిగా తన బంధాన్ని ఒప్పేసుకున్న మాలతీలత తన అనుబంధానికి మురిసిపోయింది

ప్రకృతి అసూయపడేలా నవ్వింది కవిత. మరొక్కసారి పారిజాతాలు కురిసేయి. కాస్సేపాగితే, సువర్ణ కిరణాలు మొగ్గల్ని మత్తునుంచి లేపి నవ్విస్తాయి రాత్రి అమాయకంగా తలలో తురుముకున్న మల్లెలు తెల్లవార బోతూంటే హృదయం విరిసి నవ్వుతున్నాయి.

'అబ్బ! అప్పుడే తెల్లవారాలా?' అంది కవిత.

'అయితే ఏం?' అన్నాడు సూర్యం సూటిగా కళ్ళల్లోకి చూస్తూ 'ఈ యిల్లు మనది ఇంటి వెనకనున్న తోట మనది. ఈ పారిజాతం మనది' అని కొంచెం ఆగి కవిత వైపు చూస్తూ 'ఈ పారిజాతం మాత్రం నాది...' అన్నాడు.

ఆవాల్టికి సంవత్సరమైంది వాళ్ళిద్దరూ వివాహ బంధంలోకివచ్చి

పెళ్ళి కాకముందు జరిగిన సంగతులన్నీ గుర్తుకు వచ్చాయి యిద్దరికీ అవాళ.

ఒక ఆదివారం women's college అమ్మాయిలు పిక్నిక్‌కు వచ్చారు గండిపేట. యూనివర్సిటీ నుంచి B. A. ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్‌ను తీసుకుని పిక్నిక్‌కు వచ్చాడు లెక్చరర్ సూర్యం.

అది వేసవికాలం. అనుకోకుండా వానజల్లు రావటంతో అందరూ ఒకే ఒక 'షెల్టర్' లోకి వచ్చేసేరు ఇట్లా అనుకోకుండా కాలేజీ అమ్మాయిలూ, అబ్బాయిలూ ఒక చోటికి వచ్చేసేరు.

బయట చినుకులు పడుతున్నాయి. అసలే కాలేజీ విద్యార్థులు – అందులో పిక్నిక్‌కు వచ్చారు. ఆడపిల్లలు పక్కన ఉన్నారు. ఇంక అల్లరికి ఏమి కొదవ!

కాస్త స్థాయి మితిమీరేదాకా ఊరుకుంది women's college విద్యార్థినులతో వచ్చిన లెక్చరర్ శ్రీమతి సుజాత. ఇంక లాభంలేదని తెలుసుకోగానే, చప్పట్లు కొట్టి–

'ఏమిటీ అల్లరి? మీ యిన్‌ఛార్జ ఎవరు?' అన్నది

'ఆ, నేనే–' అన్నాడు సూర్యం. 'మౌత్‌ఆర్గన్'ను మోహన్ అనే కుర్రాడి దగ్గర నుంచి తీసుకుంటున్నాడు వాయిద్దామని, సరదాగా ఆ క్షణంలో.

'చూడండి, మీ స్టూడెంట్స్ మరీ 'మేనర్స్' లేకుండా 'బిహేవ్' చేస్తున్నారు......'

ఒక్క క్షణం వెనక్కు తీసాడు సూర్యం. చివుక్కు మనిపించింది. స్టూడెంట్స్‌తో తను చాలా చనువుగా ఉండేమాట నిజమేగాని, మళ్ళా 'డిసిప్లిన్' విషయంలో పులి. అందువల్ల మరొక్కసారి ఆలోచించి అన్నాడు –

'ఎవరని మీరనేది?'

'మీ స్టూడెంట్స్ సంగతే.'

'ఒక్కసారి అలా అనెయ్యకండి. ఎవరేంచేసారో 'స్పెసిఫిక్'గా చెబితే...'

'...చెబితే? మీరు చెబితే వింటారని తోచదు. కాకపోతే కవిత hand kerchief ఆ ఎర్ర బుష్‌షర్ట్ అతను ఎందుకు తీసుకున్నట్లు?'

'మోహన్' అని పిలిచాడు సూర్యం చేతిలోని 'మౌత్‌ఆర్గన్'ను అందియ్యబోయాడు. దాన్ని విసురుగా యిచ్చేసి– 'ఏమిటిది, నువ్వు 'కర్ చీఫ్' తీసుకున్నావా?' అన్నాడు.

అందరి దృష్టులూ మోహన్ మీదే ఉన్నాయి – ఏమి చెబుతాడోనని. తీసుకున్నానని చెబితే కాలేజీలో 'వార్నింగు' తప్పదు. ఒకవేళ తీసుకోలేదని చెబితే, వెదికితే జేబులో దొరికిపోతుంది.

ఏమీ మాట్లాడకపోయేసరికి సూర్యం కోపంతో అన్నాడు –

'నువ్విట్లా చేస్తావని......'

'ఆగండి మాష్టారూ...' అని జేబులోంచి ఎర్ర రుమాలు బయటికి తీసాడు

అందరూ ఆశ్చర్యంతోనూ, సూర్యం, సుజాతా కోపంతోనూ చూసారు మోహన్ ఎందుకిట్లా అర్థం లేకుండా ప్రవర్తిస్తున్నాడో ఎవ్వరికీ బోధ పడలేదు.

'నాకు ఆ అమ్మాయే యిచ్చింది' అన్నాడు మెల్లగా.

అందరూ ఒక్కసారి ఊరుకున్నారు. సన్నగా గుసగుసలు మొదలెట్టారు. కవితమాత్రం చేతులతో ముఖం మూసుకుంది.

వర్షం తగ్గిపోయింది యింతట్లో — యింతసేపూ యిందుకోసమే వచ్చినట్లు!

ఎవరిత్రోవను వాళ్లు వెళ్ళిపోయారు.

ఆ తర్వాత కవితకూ సూర్యానికీ పరిచయం ఏర్పడింది. మోహన్ ఒక రోజున నిజం చెప్పేసాడు, తను తప్పించుకోవడంకోసం ఒక తియ్యటి అబద్ధం ఆడినట్లు. కవితకు ఏమో అనిపించింది. సూర్యం దగ్గరకు చదువుకోడానికి రావడం మొదలెట్టిన వాళ్ళ పరిచయం వాళ్ళను భార్యా భర్తలుగా చేసింది.

ఇదంతా ఒక్కసారి గుర్తుకువచ్చి చెక్కిళ్లు కెంపులెక్కాయి కవితకు.

'అబ్బ! ఎంత తియ్యనిది యీ జీవితం! ఎంత అమృతమయమైనది యీ క్షణం! ఒక్క క్షణం కాలం ఆగిపోతే ఎంత బాగుండును? చైతన్యంతో వెల్లివిరిసే ప్రకృతిలో ప్రతిదీ ఎందుకు తన రమణీయతనంతా గుచ్చి కూర్చి మాలగాచేసి మెడలో వెయ్యాలని ఉవ్విళ్ళూరుతోంది? ఈ స్వర్గం, యీ సుఖం, యీ క్రొమ్మత్తు, ఎప్పుడూ తరిగిపోకుండా ఉంటే ఎంత బాగుండును?' అనిపించింది కవితకు.

ఒక్కసారి చప్పుడైంది. స్వప్నం చెదిరిపోయింది చూస్తూ చూస్తూన్న స్వప్నం కదిలే గాలిలో కలిసిపోయినట్లయింది.



"కొంచెం, డబ్బు అప్పు ఇస్తారేమోనని.."

'ఏమిటది కవితా, ఎందుకల్లా గాబరా పడ్డావు?'

'అదికాదు సూర్యం — యీ లోటులేని జీవితం చూస్తూంటే ఒక్కొక్కసారి ఎందుకో తెలియకుండా భయమేసుకొస్తుంది. నాకు తెలియకుండా ఏదో జరిగి యీ కట్టుకుంటున్న పిచ్చుకగూడు కాస్తా...'

'అట్లా అనకు కవితా, నువ్వట్లా ఎందుకు అనుకుంటున్నానో తెలియదు. మనల్ని ప్రకృతిలో ఏశక్తీ వేరు చెయ్యలేదు'

'అట్లాగని నమ్మమంటారా?'

'నీకు అపనమ్మకమెందుకు కలగాలి?'

'దీనికి నా దగ్గర సమాధానంలేదు...'

కాస్సేపటిక్రితం చప్పుడుచేసిన కుక్క యింకా కోడిని తరుముతూనే ఉంది. అనుకోకుండా తియ్యటి కలను చెదర

గొట్టిన ఆ రెంటినీ, చూస్తూ ఉండి పోయారు యిద్దరూ.

## 2

అనుకున్నట్లే అన్నీ జరిగితే లోకంలో బాధ అనేదే ఉండదు ప్రతి వాళ్లూ, యింకొకళ్ళని అర్ధంచేసుకుంటే సమస్యే ఉండదు.

సమస్యలు వాటంతట అవి ఎక్కడ నుంచో ఊడిపడవు మన జీవితానికి సంబంధించినవన్నీ యించుమించు యీ లోకంలో తయారు కావలసినవే మన ఆశలూ, పునాదులులేని కోర్కెల భవంతులూ, క్షణ క్షణానికీ గుచ్చుకునే అనుమానాల ముళ్ళూ, యివే మనచుట్టూరా ఉన్న వ్యూహాలు. మనం తెలుసుకున్నామనుకుని ఉద్రేకంతో చేసే శపథాలూ, మొదటి చూపులోనే ప్రేమించేసి హృదయాన్నిచ్చేసేమనుకుని, యింక జీవితమంతా యిట్లాగే ఉంటుందనుకోవటం, తర్వాత ఏ చిన్న సంఘటనో ప్రతికూలంగా జరిగితే, దాన్ని ఎంతో ఎత్తుకు పెంచేసి, పడిపోతూన్న మనస్సు అంతస్థునుమాత్రం పట్టించుకోకుండా, చివరికి పర్యవసానంగా బెంబేలు పడిపోవటం — యివన్నీ ఒకదాని తర్వాత ఒకటి వచ్చితీరతయి. అంటే అదే క్రమంలో రానక్కర్లేదు.

సూర్యం జీవితంలోకి కవితా, కవిత జీవితంలోకి సూర్యం అడుగు పెట్టడానికి ఎన్ని అందమైన కథలు కల్పించుకున్నా, ఎన్ని ఊహాలతలు అల్లుకున్నా, అవన్నీ జీవితాంతం వరకూ సాగిపోయేవే ననీ, యింక దేనికీ కొదవ ఉండదనీ భావించడం వాస్తవానికి దూరమని తెలిసినప్పుడు కలిగే వ్యథ చాలా ఎక్కువగా ఉంటుంది.

కవితా, సూర్యం ఒకరి నొకరు కావాలనుకున్నారు వైవాహిక బంధంలోకి వచ్చేసారు ఒకళ్ళ నొకళ్ళు అర్ధం చేసుకోవలసిన అవసరం ఉన్నట్లు కన్పించలేదు ఎన్నో విషయాలు అర్ధమై పోయినట్లు అనిపించిందప్పుడు. ఒకళ్ళ కోసం ఒకళ్ళు పుట్టారనీ, ఎక్కడెక్కడో పెరుగుతూ వివాహబంధంలోకి రావటం పూర్వజన్మ సుకృతమనీ, యిక యీ బంధం కలకాలం నిలిచి ప్రేమ అనే సౌరభాన్ని విరజిమ్మి జీవితాన్నంతటినీ నింపివేస్తుందని నమ్మారు.

స్త్రీ పురుషుల మధ్యన ఉన్న ప్రకృతి సిద్ధమైన ఆకర్షణ, ఆలోచనను దగ్గరకు రానివ్వదు, ఆకర్షణ కళ్ళు జిగేలు మనిపించి ఆలోచనను దూరంగా తోసి వేసినప్పుడు. జీవితం వ్యాపారం కాదనీ, హృదయానికి సంబంధించిన విషయాలు బుద్ధితో ఆలోచించ కూడదని నచ్చ జెప్పుకుంటాము.

కాని నిర్దుష్టంగా యిది హృదయానికి సంబంధించిందనీ, మరొకటి బుద్ధికి సంబంధించిందనీ గిరి గీసి చెప్పలేము. చెప్పకూడదు గూడాను ఒక దానితో

మొదలిడి, రెండో దానికి రాకతప్పదు తప్పని సరిగా. కాని యీ సంగతి తెలిసే సరికి మనం సౌఖ్యపు సరిహద్దులు దాటి పోతాము.

## 3

కవిత కవిత్వం వ్రాయదు. కాని ఆమె ఊహలన్నీ కవయిత్రి మాదిరిగా కళ్ళల్లో తిరుగుతూన్నట్లనిపిస్తాయి. ఆమె కథలు రాయలేదు. కాని జీవితం కమ్మని కథగా మలచుకొందామనుకుంది. సూర్యం బోటి చదువుకున్న అన్నివిధాలా ఉన్న యువకుణ్ణి పెళ్ళిచేసుకుంది. రాబోయే రోజులు అందాల దీపాల్లాగ కళ్ళముందు కదులుతూంటే కళ్ళల్లో వాట్లను వెలిగించుకుంది

గడచిన సంవత్సరంలో చాలా మార్పులు వచ్చాయి. కవిత తండ్రి రామచంద్రయ్యగారు హైద్రాబాదు నుంచి కాకినాడకు ఉద్యోగ రీత్యా వెళ్ళిపోయారు. ఆయన కవితను అల్లారు ముద్దుగా పెంచారు, ఒక్కతే కూతురు కావడం వల్ల. చూడాలని ఉందని మరీ మరీ ఉత్తరాలు రాస్తున్నా రాయన చాలా కాలంబట్టీ.

మునుపు కవిత వచ్చినట్లే సుభద్ర అనే మరో అమ్మాయి సూర్యం దగ్గర చదువు కోడానికి వస్తోంది. సుభద్ర సూర్యంతో ఎక్కువ చనువుగా ఉండటం కవితకు అంతగా నచ్చటం లేదు. కొత్తలో కవితకూ సుభద్రకూ స్నేహం కూడా కలిసింది. వెనక్కు తిరగేస్తే ఏదో చుట్టరికం కూడా కలిసింది. కాని సుభద్ర సూర్యంకు దగ్గరగా వస్తూన్నదేమోననే అనుమానం కలిగి రోజు రోజుకూ ఎక్కువవుతోంది కవితలో. సాగదీసి కారణం అడిగితే చెప్పలేక పోవచ్చు. చెప్పవచ్చు కూడా. ఏదో చిన్నమాటమీద యిద్దరూ పకపక నవ్వుకున్నారనో, తనతో గడపవలసిన సమయాన్నంతా సుభద్రతో గడుపుతున్నాడనో అనవచ్చు.



ఒక ఆదివారం సాయంత్రం, కవితా సూర్యం కలిసి సినిమాకి 'వెడదామని బయలుదేరబోతూంటే సుభద్ర వచ్చింది నవ్వులు ఒలకబోస్తూ.

'ఎక్కడకో బయలుదేరారే మాష్టారు ?' అంది సుభద్ర.

సూర్యం ఏదో చెప్పబోతూంటే, కవిత అడ్డొచ్చి 'సినిమాకు వెడుతున్నాము' అంది.

సూర్యం గబుక్కున మాట అందుకుని 'అవును...' అన్నాడు.

ఆ 'అవును' లో 'నువ్వు ఆగిపొమ్మంటే ఆగిపోతా నన్న ధ్వని ఉన్నట్లనిపించింది కవితకు.'

'షికారు వెడదామనుకున్నాను మీతో' అంది యిద్దరిలోకీ చెరోసారీ చూస్తూ సుభద్ర.

'పోనీ సినిమాకు మరో రోజు వెడితేనో' అన్నాడు సూర్యం, కవితవైపు చూస్తూ.

కవిత ముఖంలో రంగులు మారిపోయాయి.

'నేను ఎక్కడికీ రాను' అంది, నేలలోకి చూస్తూ.

ఒకటి రెండు నిమిషాలు ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఎవరికి మాట్లాడటానికి ఏమీ దొరికినట్లు లేదు చూస్తే

'అదేమిటి మీరు సినిమా ఎందుకు మానుకోవడం?'

దానికి సమాధానం ఎవ్వరూ చెప్పలేదు.

సుభద్ర యిద్దరివైపూ అదోలాగ చూసి ఏమీ అనకుండానే వెళ్ళిపోయింది

ఇది జరిగిన వారం రోజులకు రామచంద్రయ్యగారు హైద్రాబాదు వచ్చారు ఏదో పనిమీద

'ఒకసారి అమ్మాయిని తీసుకెడతానోయ్. వాళ్ళమ్మ చూడాలనుకుంటోంది' అన్నారాయన—వచ్చినరోజు రాత్రి.

'ఏం కవితా, వెడతావా, మీ నాన్నగారు రమ్మంటున్నారు?'

'నేను వెడితేనే చాలు అనుకుంటున్నారా' అన్నట్లు చూసింది కవిత, సూర్యం వైపు.

అవాళ రాత్రి కవిత రోజూకన్నా చాలా మౌనంగా ఉంది.

'మరి మీ నాన్నగారితో రేపు వెడుతున్నట్టేనా.'

'మా నాన్నగారు మీకేమీ కానట్లు, ఏమీ అంటనట్లు మాట్లాడతారేం'

'పోనీలే. మామగారు తన కూతురు, అంటే నా భార్య అయిన కవితను పంపమని...'

ఒక్కసారి నవ్వేసారు యిద్దరూ. కాస్త తేలిక పడ్డట్లయింది. కాస్సేపాగి కవిత అంది సూర్యంతో.

'ఏమండీ, నిజంగా నేను వెళ్ళిపోతేనే చాలు అనుకుంటున్నారు కదూ......'

'...............'

'నిజం చెప్పండి. నా చేతిలో చెయ్యివేసి చెప్పండి...'

'నీ చేతిలో చెయ్యివేసి ఒక సంవత్సరము అయింది...'

'అది కాదండీ. నేనంటే మీకు మునుపున్నంత...'

'చెప్పు కవితా, చెప్పదలచుకున్నది.'

'...............'

'నువ్వు చెప్పకపోయినా, నీలో కలిగిన భావాలను అర్థం చేసుకోగలను...'

'అవి మీవే కాబట్టి...'

'ఏమిటి నువ్వనేది ?'

'ఆలోచించుకోండి మీరే. నే నంటే మునుపు ఎంత మురిసిపోయేవారో—నన్ను ఎంత మురిపించే వారో. ఎందుకింత మార్పు...?'

'నువ్విట్లా ఎందు కనుకుంటున్నావో అర్థం కావటం లేదు.'

'మీకు అర్థం చేసుకోవటం యిష్టం లేదనండి.'

'ఎందుకిట్లా మారిపోయావు నువ్వు?'

'మారింది నేనా, మీరా ?'

'నాకు అర్థమైంది కవితా, నువ్వు ఆ నాడు సినిమాకు ఎందుకు రానన్నావో ?'

'ఏమిటి మీకు అర్థమైంది ?'

'ఆడవాళ్ళు ఎంత చదువుకున్న వాళ్ళయినా అసూయకు తల ఒగ్గక తప్ప దన్నమాట'

'నాకెందుకు అసూయ ? మీ యిష్టం వచ్చినట్లు మీ రుంటారు ? నే నెవరినీ అడగటానికి !'

'ఏమాటబడితే ఆమాట అనెయ్యకు కవితా, తర్వాత బాధపడవలసి వస్తుంది. ఆవేశంలో ఏదో అనెయ్యగానే అయిపోలేదు. మనిద్దరం కలిసి బ్రతకాలి, బ్రతుకంతా.'



"డబ్బులేకపోతే ఏం, తిందాం! మరీ గొడవ చేస్తే హోటల్ ముందు పికిటింగ్ చేద్దాం"

'ఆవేశం నాకు కాదు, మీకు. ఆకర్షణకు లొంగిపోతూన్నది మీరు. నిజం చెప్పండి, సుభద్ర వచ్చినప్పటి నుంచీ నాతో సరిగా మాట్లాడటం మానేసారు కదూ...'

'అబద్ధం. సుభద్ర నాకు స్నేహితురాలు. తర్వాత నాకు శిష్యురాలు. నువ్వు మాత్రం నా దగ్గర చదువుకోలేదూ ?'

'అప్పుడు వేరు. అప్పుడు మీకు పెళ్ళి కాలేదు...అయితే మీరనేది !'

'ఏమీ లేదు. నువ్వు తొందరపడి ఏమీ అనకూ అని. పిచ్చిఆలోచనలతో బుర్ర పాడుచేసుకోకూ అని.'

గాలి దుమారం తగ్గినట్లయింది తారీకు మారటంతో.

మర్నాడు కవితను రామచంద్రయ్యగారు తీసుకు వెళ్ళారు.

మరో వారంరోజులదాకా సుభద్ర రానేలేదు. ఆదివారం నాటి ప్రొద్దున చక్కగా 'డ్రెసప్' అయి వచ్చింది సుభద్ర.

సుభద్రను గూర్చి అనుకోవటం లేదు సూర్యం యిన్ని రోజులబట్టీ. దానికి కారణం, యీ మధ్య కవితను గురించి ఎక్కువగా ఆలోచిస్తూ ఉండటమే.

ఇద్దరు వ్యక్తులు సన్నిహితంగా ఉండటం వల్ల అనురాగం పెరుగుతుంది. ఇది నిజం. కాని కొంతవరకే నిజం. ఇద్దరు సన్నిహితంగా ఉంటే అనురాగం పెరుగుతుందనటం ఎంత నిజమో, యిద్దరు వ్యక్తులు దూరంగా ఉన్నప్పుడు వాళ్ళ మధ్య అనురాగం పెరుగు తుందనటం కూడా అంతే నిజం. ఏ వస్తువుయొక్క అవసరాన్నయినా అది లేనప్పుడే గాని పూర్తిగా తెలుసుకోలేము. ఇద్దరు ఒకే చోట ఉన్నప్పుడు వాళ్ళు ఒకళ్ళ నొకళ్ళు అర్థంచేసుకున్నామనే భ్రమలో ఉంటారు. నిజానికి ఎవరికి వాళ్ళుగానే ఉండి పోతారు. చాలా మంది దగ్గరగా ఉన్నా, మధ్యన పెరుగుతూన్న అంతరాలు మాయం అవటానికి ఒకళ్ళ నొకళ్ళు దూరంగా ఉండాలి.

సుభద్రకు-కవితకు నిజానికి చెప్పుకో దగ్గంత తేడాలేదు. అయితే కవిత సంసారిక జీవితాన్ని స్పృశించింది. అంతే. ఆ అనుభూతి తనలో యింకా గూడు కట్టుకు పోలేదు. అసూయా, అనుమానం లాంటివి పోవాలంటే ఒకళ్ళమీద యింకొళ్ళకి విశ్వాసం కలిగాలి. కలిగిందని అనుకుని తృప్తిపడటంతోనే వస్తుంది చిక్కు. విశ్వాసం అనేది ఒక్కసారి ఎక్కడినుంచో ఊడిపడదు. అది అర్థం చేసుకోవటంలోంచి పుట్టుకొచ్చే పువ్వు లాంటిది.

ఒకళ్ళ నొకళ్ళు అర్థం చేసుకున్నామని ఆకాశంలో విహరిస్తే చాలదు. భూలోకంలో ఉంటున్న మనకు కేవలం ఊహచాలదు. అంతకన్న బలమైనదీ సజీవమైనదీ కావాలి.

అందువల్లే సుభద్రను అన్ని రోజుల తరువాత ఒక్కసారి చూడగానే ఏమో అనిపించింది సూర్యానికి. చెమికీ కుట్టిన తెల్లవాయిల్ చీరా, వంటిని పట్టేసి మరింత ఆకర్షణీయంగా చేస్తూన్న 'V' కట్ జాకెట్టూ! చక్కని తిలకం బొట్టూ, గిరగిరా 'హేండ్‌బాగ్' తిప్పుకుంటూనూ, చాలా హుషారుగా ఉన్న సుభద్ర వెర్రులెత్తించేలాగ ఉంది.

ఇంత సేపటినుంచీ, యిన్నిరోజుల బట్టీ బుర్రలో తిరుగుతూన్న కవిత రూపం కళ్ళముందరనుంచి తాత్కాలికంగా తొలగిపోయి దాని స్థానే సుభద్ర కనిపించింది.

'ఊళ్లో ఉన్నట్టేనా' అన్నాడు సూర్యం

'లేదండి' అంది చక్రాల్లాంటి కాటుక కళ్ళని తిప్పుతూ.

'ఈ మధ్య కాస్త 'టూర్' తగిలిందండి.'

'ఏ ఊరేంటి'

'కాబోయే అత్తారి ఊరు...'

'ఆ......'

'అట్లా అన్నారేం మేష్టారూ? నాకు పెళ్ళేమిటంటారా?'

'అదికాదు ఇంత అకస్మాత్తుగా'

'కళ్యాణం వచ్చినా,......'

'మిగతా సామెత నాకు తెలుసునులే'

'అక్కయ్య ఏదండీ?'

'వాళ్ళ నాన్నగారొచ్చి తీసుకు వెళ్ళారు'

'అరెరె...నేనే సొంతంగా శుభలేఖ యిద్దాం అనుకున్నానే? సరేలెండి పోష్టులో పడేస్తాను. టైంలేదు బొత్తిగా'

'శుభలేఖతోసహా వచ్చావేమిటి?'

'పెద్దలు అంటారు చూడండి...'

'ఆ సామెత నాకు తెలుసునులే'

శుభలేఖలో 'మోహన్' అన్న అక్షరాలు మాత్రం కనిపించాయి. మిగతావి ఏమీ కనిపించలేదు.

'అరే మన మోహన్‌కా...చెప్పనే లేదే? ఎంత గడుసు దానివి? మోహన్ 'లక్కీ ఫెలో'.

'మీరు తప్పకుండా ఎట్లాగూ వస్తారనుకోండి. కాని మీరు ఆడపెళ్ళివారి తరఫున...ఇదుగో శుభలేఖ' అని ఒక కవరు మీద సూర్యం పేరూ, మరొక కవరు మీద కవిత పేరూ వ్రాసింది.



"నీళ్ళులేని పాలు కావాలా? నీళ్ళులేని పాలు ఇస్తే, మా సూపరెంటెండెంటు మూడంతస్తుల మేడ ఎలాకట్టేవాడు?"

కవిత ఎడ్రసు దానిమీద సూర్యంచేత వ్రాయించి తన దగ్గరే ఉంచుకుంది దారిలో పోష్టుచేద్దామని.

ఏదో ఆలోచిస్తూన్న సూర్యాన్ని చూసి అంది సుభద్ర —

'ఏమీ భయపడకండి మాష్టారూ, ప్రెజెంట్ విషయంలో నేనే సెలక్టు చేసుకుంటాలెండి'

సుభద్ర వెళ్ళిపోయింది హాలులో నవ్వును వెదజల్లుతూ. ఆ శుభలేఖను మరోసారి చదువుకున్నాడు. మోహన్ పేరూ, సుభద్ర పేరూ ఒకదాని పక్కన ఒకటి ఎంతో బాగా అమరిఉన్నట్లు అనిపించింది ఆక్షణానికి.

ఏమనిపించిందో ఏమో మరి వెంటనే 'లెటర్‌పేడ్' తీసి ఉత్తరం వ్రాయడం మొదలెట్టాడు ఎంతో ఉత్సాహంగా. ★